నమస్తే తెలంగాణ

# మెదక్

I హైదరాబాద్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 MEDAK


## బాలిక కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



లెనిన్‌నగర్‌లో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి, అక్టోబర్ 3: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట గ్రామానికి చెందిన బాధిత బాలిక కుటుంబసభ్యులను గురువారం రాత్రి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివిధాలుగా అండగా ఉంటానని, లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం లెనిన్‌నగర్‌కు చెందిన ములుగు యాదయ్య, బత్తుల నర్సింహులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా డిజిటల్ కార్డుల సర్వే



డిజిటల్ సర్వేను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, అక్టోబర్ 3: డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించాలన్నారు. మండలంలోని తోపుగొండ గ్రామంలో చేపట్టిన సర్వేను గురువారం ఆమె పర్యవేక్షించారు. ఇంటి నంబర్, చిరునామా, కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యులకు యజమానితో ఉన్న సంబంధం వంటి వివరాలు నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియను తహసీల్దార్, ఆర్డీఓ, సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. డిజిటల్ కార్డుల సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ కార్డులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలు సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కంది తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భూబాధితులు అధైర్యపడొద్దు

- గుంట భూమి కూడా పోనివ్వం
- న్యాయం జరిగే వరకు రైతుల తరపున పోరాటం చేస్తాం
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లోని వడ్డి, డప్పూర్, మల్గి రైతులతో హరీశ్‌రావు సమావేశం

## ఫార్మాసిటీ బాధితులకు అండగా బీఆర్‌ఎస్



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్‌లో ఫార్మాసిటీ భూబాధితులతో సమావేశమైన హరీశ్‌రావు



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్‌లో పంటలను పరిశీలిస్తున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 3 : ఫార్మాసిటీలో భూములు కోల్పోతున్న బాధితులు అధైర్యపడొద్దని, బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. గురువారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీలో భూములు కోల్పోతున్న భూబాధితులు డప్పూర్‌లో చేపట్టిన ఆందోళనలో పాల్గొని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు దగ్గరగా, కాలుష్యం లేకుండా జీరో వ్యర్థాలతోపాటు అన్ని అనుమతులతో 15 వేల ఎకరాల భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయకుండా రియల్ ఎస్టేట్ చేసి, న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, మల్గి, డప్పూర్ గ్రామ శివారులోని 2003 ఎకరాల బంగారం లాంటి పచ్చని భూములను ఎలాంటి సమాచారం లేకుండా బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. పోరంబోకు, రాళ్లు, రప్పలతో వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేసుకోవాలే తప్ప, బంగారం లాంటి భూములను ఫార్మాసిటీకి గుంజుకుని రైతులను రోడ్డుపాలు చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జేసీబీ, ప్రొక్లెయిన్ వస్తే ఎమ్మెల్యే మాణిక్‌రావుతోపాటు తాను అడ్డం పోతామన్నారు. భూబాధితులకు చెందిన గుంటా భూమి కూడా ఫార్మాసిటీ కోసం సేకరించకుండా బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. కేంద్ర గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టును ఆశ్రయించి పైసా ఖర్చు లేకుండా బాధితుల పక్షాన కేసులు వేస్తామన్నారు. అవసరమైతే ఫార్మాసిటీ భూబాధితుల కోసం అసెంబ్లీలో కొట్లాడుతామన్నారు. బాధిత రైతులెవ్వరూ అధైర్యపడవద్దని, ఒకమాట మీద ఉండండి, ఎవరు వస్తారో, ఎట్లా వస్తారో చూస్తామన్నారు. ఫార్మాసిటీ కోసం భూసేకరించేందుకు ఎవరైన వస్తే ఒక్క ఫోన్ చేయండి, రెండు గంటల్లో వస్తామన్నారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాటం చేసి భూములను దక్కించుకుందామని హరీశ్‌రావు రైతులకు భరోసానిచ్చారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్న ఆయా గ్రామాల పరిధిలోని చెరువులు, వాగుల నుంచి కాలుష్య జలాలు మంజీరాలో చేరి పాడైపోతాయన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు నిజామాబాద్, హైదరాబాద్ జంటనగరలకు తాగు, సాగు నీటిని ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసేందుకు బీఆర్‌ఎస్ పాలనలో సంగమేశ్వర, బసమేశ్వర ప్రాజెక్టులు ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేపట్టకుండా నిలిపివేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. 300 రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ రైతుబంధుకు దిక్కులేదని, అసంపూర్తిగా రుణమాఫీ, దసరా పండుగకు బతుకమ్మ చీరలు, నెలనెలా పింఛన్లు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. ఆడ పిల్లల పెండ్లికి తులం బంగారం, మహిళాలకు రూ. 2,500 ఇస్తామని రేవంత్ సర్కార్ మోసం చేసిందన్నారు.

**కోహీర్ జామకు, డప్పూర్ పుదీనాకు ఫేమస్**

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ జామకు, డప్పూర్ పుదీనాకు ఫేమస్ అని హరీశ్‌రావు అన్నారు. డప్పూర్ సమీపంలో ఫార్మాసిటీతో భూములు కోల్పోతున్న రైతుల పొలాలను సందర్శించారు. పొలాల్లో రైతులు సాగు చేసిన పత్తి, పుదీనా తదితర పంటలను పరిశీలించారు. అనంతరం పలువురు రైతులతో ఆయన మాట్లాడారు. బోరు, బావుల కింద పత్తి, కంది, సోయాబీన్, మినుము, పెసర, మొక్కజొన్న, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, కూరగాయల పంటలతోపాటు పాడి పశువులు, మేకలు, గొర్రెల పెంపకంతో జీవనాన్ని సాగిస్తున్నమని రైతులు పేర్కొన్నారు. మేము పండిస్తున్న పుదీనాను ప్రతిరోజూ జహీరాబాద్, బీదర్, నారాయణఖేడ్‌తోపాటు బోయిన్‌పల్లి మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని రైతులు తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో డప్పూర్ గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుతోపాటు మిషన్ కాకతీయ కింద చెరువులో పూడికతీత పనులు చేపట్టామని గుర్తు చేశారు. భూమి, నీరు, గాలిని కాలుష్యకోరల్లోకి నెట్టే ఫార్మాసిటీకి ప్రాణాలు పోయినా సారవంతమైన భూములు మాత్రం ఇచ్చేది లేదంటూ రైతులు కన్నీరు పెట్టకున్నారు.

**రైతుల పక్షాన పోరాటం: ఎమ్మెల్యే మాణిక్‌రావు**

ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాటం చేస్తామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఇప్పటికే న్యాల్‌కల్ మండలంలోని 17 గ్రామాల్లో నిమ్జ్ పేరుతో నాశనం చేశారని, మళ్లీ కొత్తగా మూడు గ్రామాల్లో 2వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామంటే చూస్తూ ఉరుకోబోమని స్పష్టం చేశారు. రసాయన కంపెనీలు వస్తే ఆయా గ్రామాల పరిస్థితి ఏమవుతుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. మూడు పంటలు పండే సారవంతమైన భూములు ఉనికి కోల్పోవడమే కాకుండా ఈ ప్రాంతం కలుషితమై నివాసయోగ్యం కాకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నారాయణఖేడ్, అందోల్ మాజీఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతి కిరణ్, బీఆర్‌ఎస్ నాయకులు బీరయ్యాయాదవ్, పెంటారెడ్డి, నామ రవికిరణ్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, మండల నాయకులు భాస్కర్, నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్, వీరారెడ్డి, మారుతీయాదవ్, రవికుమార్, గ్రామ నాయకులు రవికుమార్, శివరాజ్, నాగన్న, పూండికూర రవికుమార్, రాజు గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాడుతాం



పచ్చని పొలాలు, ఎత్తయిన గుట్టలు, ప్రకృతి రమణీయమైన భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడం సరికాదు. గుట్టు చప్పుడు కాకుండా సర్వేలు చేపట్టి బలవంతంగా భూమిని సేకరిస్తూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. ప్రాణాలు పోయిన సరే.. తాతలు, ముత్తాతలు, పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన, కొనుగోలు చేసిన పట్టా, ప్రభుత్వ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఫార్మాసిటీకి ఇవ్వబోం. పంట భూములను సేకరించవద్దు. ఫార్మాసిటీని ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. లేనిపక్షంలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఎంతవరకైనా పోరాటం చేస్తాం.

– రవి కుమార్, రైతు, గ్రామ మాజీ సర్పంచ్



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన భూబాధితులు, రైతులు

## నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, క్యామ మల్లేశ్

కొమురవెల్లి, అక్టోబర్ 3: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో బాధిత బాలిక కుటుంబాన్ని గురువారం కురుమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీ జనగామ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మాట్లాడుతూ..బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని ఎన్‌కౌంటన్ చేయాలన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని, ఇటువంటి ఘటనలు జరిగిన వెంటనే కఠిన శిక్షలు పడేలా చట్టంలో మార్పులు చేయాలన్నారు. బాలికపై దాడి జరగడంతోనే గ్రామస్తులు తిరగబడ్డారని, ఆడపిల్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, గ్రామస్తులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. బాలికకు ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాలికపై జరిగిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ..బాలికపై లైంగిక దాడి ఘటనను వ్యక్తిగతంగా, కాంగ్రెస్ పార్టీ పరంగా తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబానికి అవసరమైన సహాయం అందించడం తోపాటు నిందితుడికి కఠిన శిక్ష పడే విధంగా చర్యలు చేపడుతామన్నారు. గ్రామంలో 13మందిపై పెట్టిన కేసులను పోలీసులు ఉపసంహరించుకోవాలన్నారు. కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా శిక్షలు ఉండాలని, దిశ కేసులో అప్పట్లో నిందితులకు ఎలాంటి శిక్ష పడిందో అలాంటి శిక్షే నిందితుడికి వేయాలన్నారు. అంతకుముందు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను కలిసి నిందితుడికి కఠిన శిక్ష పడేవిధంగా చర్యలు చేపట్టడంతో పాటు గ్రామస్తులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర నాయకులు పుష్పానగేశ్, బాల్దె సిద్దిలింగం, సెవెల్లి సంపత్, జయ మల్లేశ్, మ్యాక సంతోష్‌కుమార్, బర్మ రాజమల్లయ్య, మహాదేవుని శ్రీనివాస్, బ్రహ్మాండ్లపల్లి చంద్రం, బుడిగె ఐలేనిగౌడ్, అందే బీరయ్య, అందే అశోక్, నర్సింహ పాల్గొన్నారు.

## దుబ్బాకలో ఉద్రిక్తత



ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకులు
- తిప్పికొట్టిన బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక, అక్టోబర్ 3: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను టార్గెట్ చేస్తూ..అధికార కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. గురువారం దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపించారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొని తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దుబ్బాకలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వస్తున్న విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు సైతం అక్కడికి చేరుకున్నారు. శివాజీ చౌక్ వద్దకు ఎమ్మెల్యే కాన్వాయ్ వస్తుండగా..కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు స్పందిస్తూ కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు కోడి గుడ్లు విసిరేందుకు ప్రయత్నించారు. పోలీసుల జోక్యంతో రెండు పార్టీల నేతలు అక్కడి నుంచి వెనుదిరిగారు. అధికార కాంగ్రెస్ నాయకులు గూండాయిజం ప్రదర్శిస్తున్నారని, చిల్లర రాజకీయాలు చేస్తూ అలజడి సృష్టిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్‌వి సిల్లీ రాజకీయాలు**

దొంగే ..దొంగ అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నెలకొందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మంత్రులే రోడ్డునపడటం హాస్యాస్పదంగా మారిందన్నారు. ఓ మహిళా మంత్రి కంటతడి పెట్టుకోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా మంత్రికే రక్షణ కరువైతే..సామన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో మంత్రిపై ట్రోల్ చేసే బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కదా అంటూ గుర్తు చేశారు. అధికారంలో ఉన్నా మీరు బాధ్యతను మర్చి ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్‌ఎస్‌పై నిందలువేయడం సరికాదన్నారు.

**కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తుంది..**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తుండటం హాస్యాస్పదంగా మారిందని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తమవంతుగా పోరాడుతుంటే ..కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## దోచుకునేందుకే మూసీ ప్రక్షాళన



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 3 : మూసీ ప్రక్షాళన పేరుతో దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌ను భారీగా పెంచిందని,ఆనాడు రూ.16వేల కోట్లతో ప్రక్షాళన చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్ధమైందని, కానీ నష్టపోతున్న బాధితుల విజ్ఞప్తి మేరకు వెనక్కి తగ్గిందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షా 50వేల కోట్లతో ప్రణాళిక రూపొందించిందన్నారు. గతంలో కిలోమీటరుకు రూ.170కోట్లు ఖర్చు అవుతాయని ప్రణాళిక రూపొందించగా, నేడు కిలోమీటరుకు రూ.2700 కోట్లు ఖర్చు అవుతాయని పేర్కొంటున్నారు. మూసీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అందులోనే దుంకుతామని మాట్లాడుతుండగా, మరో మంత్రి కొండా సురేఖ సభ్యసమాజం తలదించుకునేలా మహిళ అన్న విషయాన్ని మరిచి సినీనటి సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేసిందన్నారు. మహిళా మంత్రి సురేఖకు మహిళలపై ఏమాత్రం గౌరవంలేదని, సమంతపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పది నెలల కాలంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.90వేల కోట్ల అప్పు చేసిందని, రాష్ట్రంలో ఎలాంటి కొత్త పథకాలను ప్రారంభించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మైనంపల్లి మాట్లాడుతున్న భాష తీరును చూస్తే రాష్ట్ర ప్రజలు తలదించుకునేలా ఉన్నాయన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కూల్చివేతలతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని, వెంటనే హైడ్రాను ఉపసంహరించుకోవాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఉచిత బస్సు తప్ప మరోటి అమలుచేయలేదన్నారు. త్వరలోనే రుణమాఫీపై రాజీవ్ రహదారిని దిగ్బంధనం చేస్తామన్నారు. అనంతరం మైనంపల్లి హన్మంతరావుపై గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు రజిత, మెట్టయ్య, చందు, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, గుంటుక రాజు, రమేశ్‌గౌడ్, బొల్లారం ఎల్లయ్య, ఆర్‌కే శ్రీను, కల్యాణ్‌కర్ శ్రీను, అమర్, నిజాం, హన్మంతరెడ్డి, శివకుమార్, నాగులు, ఎల్లం తదితరులున్నారు.




అభిప్రాయ సేకరణలో ఆర్డీవో రాజు, తహసీల్దార్లు

## మార్కెట్ రేటులో సగానికే భూములిస్తాం

సంగారెడ్డి, అక్టోబర్ 3: ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగం భూసేకరణకు ఆదిలోనే అడ్డంకులు మొదలయ్యాయి. సదాశివపేట మండలం పెద్దాపూర్, కొండాపూర్ మండలం గిర్మాపూర్ గ్రామాల మీదుగా 65వ జాతీయ రహదారిపై నిర్మించనున్న సర్కిల్‌కు ఇరు గ్రామాల అన్నదాతలు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరని అనుపిస్తున్నది. మార్కెట్ ధరలో ప్రభుత్వం సగం రేటు ప్రకటిస్తేనే భూములు ఇస్తామని బహిరంగంగా వెల్లిడిస్తున్నారు. గురువారం ఆర్డీవో రాజు అధ్యక్షతన జిల్లా పరిషత్ పాత కార్యాలయంలో రెండు గ్రామాల రైతులతో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ఉన్న భూములు మార్కెట్లో ఎకరానికి రూ.6కోట్లు పలుకుతున్నాయని, దాంట్లో సగం ధర చెల్లిస్తే ట్రిపులార్‌కు భూములు ఇస్తామని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ముందు ధర ప్రకటిస్తే ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో పెద్దాపూర్ గ్రామంలో ఫిల్టర్ బెడ్‌కు 300 ఎకరాల భూమిని ఇచ్చామని, జాతీయ రహదారిలో వ్యవసాయ భూములు కోల్పోయామని, మళ్లీ ట్రిపుల్ ఆర్‌కు భూములిచ్చి ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు.

**ఆధార్, పట్టాదారు, బ్యాంకు ఖాతాలు ఇవ్వం**

అభిప్రాయ సేకరణ అని చెప్పి ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన తర్వాత పట్టాదారు పాసు బుక్కులు, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు జిరాక్సులు ఇవ్వాలని ఆర్డీవో రాజు రైతులను కోరారు. పోలీసుల బందోబస్తులో దౌర్జన్యంగా జిరాక్స్‌లు అడగటం భావ్యంకాదని, తమ అభిప్రాయం లేకుండా భూములు ఎలా తీసుకుంటారని రైతులు అధికారులను నిలదీశారు. మాజీ సర్పంచ్‌లు పట్లోళ్ల వెంకటయ్య, మల్లేశం, కృష్ణ, రమేశ్, గొల్ల శంకర్‌యాదవ్, రాదేశ్యాంరావు, జయరాజ్, ఇంద్రమ్మ, రాము లు, యాదగిరి, అశోక్, మల్లేశ్వర్, మన్నన్ సిద్దిక్ పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణకు తరలివచ్చిన రెండు గ్రామాల అన్నదాతలు

## ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 3: వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సన్నరకం, దొడ్డు రకం ధాన్యం సేకరణకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చొప్పున మద్దతు ధర చెల్లించడంతోపాటు సన్న రకానికి అదనంగా రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన 48గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ కావాలన్నారు. డీఎస్సీ ద్వారా 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్న నేపథ్యంలో విజయదశమికి ముందే ఈనెల 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలను అందజేస్తామన్నారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలనను ఈనెల 5లోగా పూర్తి చేయాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నాటు బాంబుల తయారీ ముఠా అరెస్టు

హుస్నాబాద్, అక్టోబర్ 3: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ కేంద్రంగా నాటు బాంబులు తయారు చేస్తూ వన్యప్రాణులను హతమారుస్తున్న ఐదుగురు సభ్యులతో కూడిన ముఠాను అరెస్టు చేసినట్లు సీఐ కొండ్ర శ్రీనివాస్ తెలిపారు. గురువారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడించారు. మీర్జాపూర్ శివారులోని గుట్ట పక్కనున్న వ్యవసాయ క్షేత్రాల వద్ద నాటు బాంబులు తయారు చేస్తూ వన్యప్రాణులను వేటాడుతున్న పిట్టల స్వామి, బదనాపురం తిరుపతి, కందుకూరి భాస్కర్, ఇటిక్యాల సతీశ్, శ్రీమంతుల శ్రీనివాస్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం ఇక్కడే నాటు బాంబు పేలి మీర్జాపూర్‌కు చెందిన ఎండీ ఖలీం చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరపగా ఈ ముఠా ఆచూకీ తెలిసిందని చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓ ఇంట్లో సోదాలు చేయగా నాటు బాంబులు సైతం దొరికాయన్నారు. సమావేశంలో ఎస్ఐ తోట మహేశ్, కానిస్టేబుళ్లు నరేశ్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.